నేను ఎవరికీ తీసిపోయినవాడిని కాదలుచుకో లేదు. నడుస్తున్నాను.

మళ్ళీ అదే చప్పుడు గరగర....గరగర....

ఆగి ఆలోచిస్తున్నాను. 'బతుకను బాటను ఒంటరిగా నడచియేపోవలె వడి వడిగా' అన్న సినిమా పాట జ్ఞాపకం వచ్చింది. వేగంగా నడిచి చూస్తేనో.

గబగబ కొంతదూరం నడిచి, ఆ గర గర మరింత ఎక్కువగానూ జోరుగానూ వినిపించే సరికి రోడ్డు పక్కకి వెళ్ళి నిలబడ్డాను—ఆ వొచ్చేవాళ్ళెవరో నన్ను దాటుకుని ముందుకి వెళ్ళిపోతారేమో అన్న వుద్దేశంతో.

చిత్రం ఏమిటంటే, ఆ చప్పుడూ నాతో బాటే పక్కకి వచ్చి ఆగింది. అంతేగాని ముందుకి వెళ్ళింది ఎవరూ లేరు.

కొంతసేపు ఆగి మెల్లిగా రోడ్డు మధ్యకి వొచ్చేను. చప్పుడూ మెల్లిగా రోడ్డు మధ్యకి వొచ్చింది.

ఇహ నిలబడి స్థిమితంగా ఆలోచించడం ఒక్కటే మిగిలింది.

ఆగి ఆలోచిస్తున్నాను. గాలి వేసేదాకా ఈ చప్పుడు లేదు. అంటే గాలిని బట్టి కదులు తున్న దేనివల్లో ఈ చప్పుడవుతున్నట్లుంది. మరి ఆగినప్పుడు లేదేం? నడుస్తున్నప్పుడు, గాలికి కదిలేది ఏది?

కనుక్కోవడానికి నడిచేను-కిందకి చూస్తూ.

పేంటు కాలు గాలికి లోపలి వైపుకి పొంగు తోంది. కాళ్ళు ఒకదానితో ఒకటి రాపాడించు కుంటున్నాయి.

డోరియా గుర్తొచ్చింది.

గరుకు ఉపరితలాలు ఒకదానితో ఒకటి రాపాడించుకుంటున్నప్పుడు పుడుతున్న ధ్వని అది.

డోరియా ఇచ్చిన టోకరా.

ఏదో కనుక్కున్న విజ్ఞానవేత్తలా ఆనం దిస్తూ మిగిలిన మైలున్నర మేరా ఆగుతూ నడుస్తూ ఊరు చేరేను.

ఊరి వెలుపల ముసాఫిర్‌ఖానా (పాంథ శాల)లోని గు(బు)డ్డి దీపం కనబడేసరికి అందు లోని వాళ్ళని లేపి నా అనుభవాన్ని చెప్పేద్దామా అనిపించి తమాయించుకుని, నా గదిలోకి చేరు కున్నాను. □


# దీపావళి ప్రత్యేక సంచిక

## 1980

ఎప్పటిలాగే జ్యోతి ఈ సంవత్సరం కూడా తన పాఠకులకు దీపావళి ప్రత్యేక సంచికను తన ప్రత్యేక బాణీలో రూపొందించి సమర్పిస్తుంది.

మీరు మెచ్చే కథలూ, కవితలూ, కార్టూన్లూ, ఇతర ఆకర్షణలతోపాటు ప్రత్యేకాకర్షణగా ఒక పూర్తి నవల ప్రత్యేక సంచికలో ప్రచురించబడుతుంది.

ముఖచిత్రాన్ని 'బాపు' అలంకరిస్తారు

200 పేజీలకు పైబడిన ఈ ప్రత్యేక సంచిక దీపావళికి పదిరోజులు ముందే మీ ముందుకొస్తుంది.

రచనలు ఆగస్టు 15లోగా మాకు చేరేలా పంపవలసిందిగా రచయితలను కోరుతున్నాము.

జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక కొనడం
దీపావళికి ముందే పండగ జరుపుకొనడం!


# ఓ ఇంటి రామాయణం


—మొవ్వ. బాబూరావు


ఆకాశం పేథాస్‌గా 'శ్రీరంజని మొహంలా వుంది ఎప్పుడు అవకాశం వస్తుందా వాన కురిపిద్దామని.

మేఘాలు మాయాబజారులో యస్వీఆర్ గర్జించినట్లు గర్జిస్తున్నాయి.

ఇంట్లో అలారం హిజ్ మాస్టర్స్ వాయిస్ రికార్డులా ఇష్టం వచ్చినట్లు మ్రోగిపోతోంది.

గాఢ నిద్రలో ఇహం మరచిపోయి నిద్ర పోతున్న సుబ్బారావుకి పిచ్చికోపం వచ్చింది అలారం చేస్తున్న శబ్దానికి.

బంగారంలాంటి కల ఝంఝామారుతంలో కలిసిపోయినట్లనిపించింది.

చురుక్కుమంటే తొడమీద కసిగా చేయి వేసి చేత్తో నలిపాడు.

కావలసినంత జ్యూసు తాగేసి దుప్పట్లో దూరిపోయింది సుబ్బారావుకి అందక వారం రోజులనుంచి ఆ దుప్పట్లోనే దినదినాభివృద్ధి అవుతున్న నల్లిపిల్ల.

అలారం కూత ఆపింది స్టేషన్‌లో నుంచి వెళ్ళిపోయిన రైలుబండీలా.

చిరాగ్గా, బద్ధకంగా వొళ్లు విరుచుకుంటూ లేచాడు సుబ్బారావు భార్య చేతిని పక్కకు పెడుతూ.

"తాయారూ లే!" నిద్రాదేవి ఒడిలో హాయిగా పడుకున్న భార్యని ఒక కుదుపు కుదిపాడు.

"అబ్బ! అప్పుడే తెల్లారిందాండీ?" భర్త తన ఒంటిమీదనుంచి తీసేస్తున్న దుప్పటిని లాక్కుని బిడాయించుకుని మళ్ళీ నిద్రలోకి జారిపోయింది తాయారు.

ఖర్మ! ఏనాడు చేసుకున్న పాపమో!

"ఒసేయ్ నిన్నే! ఐదు దాటినట్లుంది. కాస్త తొందరగా లేచి వేణ్ణీళ్ళు తగలెయ్యి" అంటూ లైట్ కోసమని దగ్గర్లో వున్న స్విచ్ ఆన్ చేసాడు.

హు! సరిపోయింది కరెంట్ లేదు. ఇహ ఇవ్వాళ వెళ్ళినట్టే!

"తాయారు! కరెంట్ లేనట్లుంది. అగ్గిపెట్టె తీసి కాస్త లాంతరు వెలిగించు" చీకటిలోనే నుంచుని అన్నాడు.

"అబ్బా! కాస్సేపు పడుకోనీయండి. కరెంట్ ఎలాగూ లేదుగా! కాస్త లేటుగా వెళ్ళకూడదూ....?"

సుబ్బారావుకి చిర్రెత్తుకొచ్చింది.

"ఇందాకట్నుంచి చూస్తున్నాను, నీ నిద్రా నువ్వూనూ! మొగముండాకొడుకు ఆఫీసుకు తగలడాలి, వాణ్ని కాస్త తొందరగా పంపే ఏర్పాటు చేయాలన్న ఉద్దేశం ఏ మూలన్నా వుండి చచ్చిందా!" ఆఫీసర్ జ్ఞాపకం వచ్చే సరికి మరింత రెచ్చిపోయాడు.

తాయారుకు ఒక్కసారి మత్తు వదిలినట్లు అయింది. లేచి కూర్చుంది.

అలా అంటేనే భార్య లేస్తుందని సుబ్బారావుకి బాగా తెలుసు. పయిగా ఆఫీసర్‌గారు జ్ఞాపకం వచ్చారు. ఇంకేం ఇష్టం వచ్చినట్లు మాట్లాడేసాడు.

భార్యని కష్టపెట్టటం తనకి యిష్టం లేదు. కాని ఏం చేస్తాం! తప్పదు! గవర్నమెంటు తమలాంటివాళ్ళ మొహాలమీద అలా రాసారు.

"అగ్గిపెట్టె వంటింటిలో అలమారు మీద వుంది" అడుగులు వేస్తూ అంది తాయారు.

"నువ్వు ఇక్కడే వుండు నేనే నెమ్మదిగా వెళ్ళివస్తాను. ఇంతకీ లాంతరు ఎక్కడ వుంది?

ఆ కూజా ప్రక్కనే వుందా లేదా దానికి అక్కడ్నుంచి స్థాన చలనం కలిగించావా?"

"చాల్లెండి! మీ జోకులు మీరూనూ! వెళ్ళి అగ్గిపెట్టె తీసుకురండి'' ఆవలిస్తూ తాయారు అంది.

మినీ లోయర్ కే.జీలో చదివే పిల్లాడులా తప్పటడుగులు వేసుకుంటూ రాని కరెంట్‌ని తిట్టుకుంటూ అలాగే ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్‌కి నోటితోనే మెమోలిచ్చేస్తూ చికాగ్గా ముందుకు కదిలాడు.

"ఢన్........"

"ఏమిటండీ! ఏమిటీ ఆ మోత!" కంగారు పడిపోయింది తాయారు.

"నా శార్ధం! నువ్వు అక్కడే వుండు! ఇక్కడికి మాత్రం తగలడబోకు" తలుపు ముద్దు పెట్టుకున్న ముఖాన్ని చేతితో రాసుకుంటూ కోపంగా అన్నాడు సుబ్బారావు.

వెధవ ఆఫీసులు! వెధవ ఉద్యోగాలు! ఛీ! ఛీ! ఇలా ఆఫీసులకి తొందరగా రమ్మంటే ఏమిటనో వీళ్ళ వుద్దేశం! ఇదేమన్నా అట్లతద్ది పండుగలా! మనిషికి నిద్ర ఎంత • అవసరం? పైగా వానాకాలం! రాత్రి పక్కమీద ఒరిగినప్పట్నుంచీ భయమేకదా! తెల్లారి ఐపోతోందేమో అని! అలారం మ్రోగుతుందేమో అనీ గుండె దడ దడ.

"ఏమేవ్ ఇక్కడ అగ్గిపెట్టె కనబడటం లేదు."

"అబ్బా!" అంటూ మూలిగాడు మళ్ళీ.

"ఏమండీ! మళ్ళీ ఏమయింది?"భర్త ఆజ్ఞను దాటకుండా అక్కడే అలా చీకటిలో కంగారు పడసాగింది తాయారు.

"ఇక్కడ చెయ్యి పెడితే ఏదో కుట్టినట్లుంది ఖర్మ."

"కొంపతీసి తేలుగాని కాదుకదా!"

"అగ్గిపెట్టెని, తేలుని ప్రక్క ప్రక్కనే పెట్టేవేంటి!" నొప్పిని భరిస్తూనే జోకేసాడు.

"ఛ! ఏమిటండి ఆ మాటలు?" సన్నగా ఏడుపు గొంతుతో అంది మంగతాయారు.

చచ్చాం! కొంపదీసి ఈవిడగారు ఏడుపు లంకించుకోదుకదా! కొద్దిగా లోపలే నొచ్చుకున్నాడు సుబ్బారావు భార్యతో తను అన్న మాటలకి.

బయట శ్రీరంజని క్లయిమాక్స్ సీనులో వున్నట్లుంది.

కుంభవృష్టి కురుస్తోంది.

"దొరికిందాండి?"

బ్రతికేంరా బాబూ! "ఆ దొరికిందే ఈ మూల!"

ఐదు పుల్లలు మొరాయించిం తర్వాత నాలుగుసార్లు చంద్రుతలను బరికినట్లు బరికిం తర్వాత ఆరోపుల్ల మెల్లగా ప్రమోషన్‌లేని ఎన్. జీ. వోలా నవ్వింది ఓ నవ్వు.

దాని చిరునవ్వుతోనే లాంతర్ వునికిని గమనించాడు సుబ్బారావు.

నెమ్మదిగా కొండెక్కుతున్న వెలుతురు సాయంతో లాంతర్ దగ్గరకు వెళ్ళి లాంతర్ వెలిగించాడు త్వర త్వరగా.

అంతే! 'నా ఆయుష్షు ఇన్ని సెకండ్లే' అంటూ కన్ను మూసింది వెలుతురు నిచ్చిన అగ్గిపుల్ల.

లేచిన అర గంటకి భార్యా భర్తలు మసక మసగ్గా ఒకళ్ళని ఒకళ్ళు చూసుకున్నారు.

"అలా కొండపల్లి బొమ్మలా ఫోజ్ ఇస్తూ నుంచోకపోతే కాస్త స్టవ్ అంటించి నీళ్లు పెడితే నీ కొంపలేవీ మునిగిపోవు" వద్దనుకుంటూనే కసిరాడు భార్యని.

"మీరేకదండి, ఇక్కడ్నుంచి కదలద్దని...."

"ఆహా! భర్తమాటని జవదాటని భార్యని ఇన్నాళ్ళు కదా చూసింది! ఎంత అదృష్టవంతుణ్ని!"

హేళనగా అంటున్న సుబ్బారావు మాటలు విని నిజమే అని నమ్మి "చూసారా! నేనంత...."


"ఛీ నోర్మూయ్ వెళ్ళి నీళ్లు పెట్టు!" గర్జించాడు సహించలేక.

వర్షం ఇంట్లొనే కురుస్తోంది పయా మంగ తాయారు కంట్లోంచి.

సుబ్బారావు మసక చీకటిలోనే అప్పుడున్న తాయారుని చూసి తల్లడిల్లి పోయాడు.

"తాయారూ! నేను అక్కడే నుంచోమంది వెలుతురు రాక ముందు. ఇప్పుడు ఈ జోడి





లాంతరు చూడు ఎలా ఇచ్చేస్తోందో వెలుతుర్ని!"

పెళ్ళయి ఏడాది కూడా కాలేదు. పెళ్ళాన్ని తిట్టినందుకు నొచ్చుకున్నాడు.

బయట చలి, వాన, గాలి ఒకదాని కొకటి పోటీ పడుతున్నట్లున్నాయి.

వెచ్చగా ఇటువంటి సమయంలో పడుకోక ఇదేం ఖర్మ?

ఏం చేస్తాం ఏనాడు చేసుకున్న పాపమో! ఈ రోజు ఇలా అనుభవించాల్సొస్తోంది. మార్నింగ్ అవర్స్ ఆఫీసులో ఎక్కువగా పని చేయటానికి ఉపయోగపడుతుందిట! లేని ఫ్రెష్‌నెస్ అంతా ఈ టయింలో వుంటుందని ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని పద్ధతిని ప్రవేశపెట్టింది. 'బుద్దులు భూములు ఏలుదామంటే రాతలు గాడిదలు కాసాయిట'కోపంలో వున్నప్పుడు సుబ్బారావుకి సామెతలు తెగ గుర్తుకొచ్చేస్తాయి. తిండీ తిప్పలు లేక అక్కడికి (ఆఫీసులకి) తగలడ్తే రోగిష్టి వెధవ ఆస్పత్రిలో కూర్చున్నట్లుంటుంది. అక్కడ ఆఫీసర్‌గార్ని చూస్తే చాలు ఇంజెక్షన్ పట్టుకొస్తూన్న పశువుల డాక్టర్‌లా అనిపిస్తాడు. పోనీ అష్ట కష్టాలుపడి కొంపనుంచి బయట పడ్దామంటే అదీ లేదు.

పడీ పడీ ఐదింటికి లేచీ ఎక్కడెక్కడ ఏమున్నాయో చూసుకుందామంటే కరెంట్ వుండి చావదు. పంపు తిప్పితే సరే సరి నెమ్మదిగా నీళ్ళు గుళ్ళో పూజారి ఇస్తున్న తీర్థంలా ఒయ్యారంగా వస్తుంటాయి చచ్చేంత సిగ్గుతో. గంటకి ఓ అపుకార నిండితే నిండినట్టే! కాఫీ ఓ గుక్క నోట్లో పోసుకుందామంటే పాలు నెమ్మదిగా తను ఆఫీసుకి బయల్దేరే ముందు వస్తాయి కొంపకి. వీటన్నిటిని వదులుకుని బస్‌స్టాప్‌కి వెళితే అంతే! బస్సులు వస్తాయో రావో! వాటి అలకలు మనం తీర్చలేం గదా!

వస్తే షైంకి పది నిముషాలు ముందే వచ్చి తుర్రుమంటాయి లేదా యింతే సంగతులు-చిత్తగించవలెను. ఆ బస్సు ఈ బస్సు పట్టుకుని పోసీ నానా తంటాలు పడి ఆఫీసుకి చేరామా, అటెండెన్సు రిజిష్టర్ సెక్షన్లో వుండలేక విల విల్లాడుతూ ఆఫీసర్‌గారి చేతిలోకి వెళ్ళిపో తుంది మాంత్రికుడు చేజిక్కించుకున్న మంత్ర దండంలా.

మొన్నటికి - మొన్న ఏమయింది, తను ఇలాగే ఆఫీసుకి లేటుగా వెళ్ళేసరికి రిజిష్టర్ ఆఫీసర్‌గారి రూంలోకి వెళ్ళిపోయింది. ఇప్పుడే వెళ్ళింది వెళ్ళి త్వరగా సైన్ చెయ్యమని సెక్షన్‌లోవాళ్ళు చెబితే తను ఆల్ మోస్టు పరిగెత్తినంత పనిచేసి ఆయన రూంకి చేరుకుని అప్పుడే రెడ్ ఇంక్ పెన్నుని అటెండెన్సు రిజిష్టర్ కాయితాల మీద అన్చబోతున్న ఆఫీసరుగారి పర్మిషన్ తీసుకునే ఎలాగయితేనేం సంతకం చేసాననిపించుకున్నాడు.

"నిద్రమత్తు యింకా వదిలినట్లు లేదే?" వ్యంగ్యంగా అంటున్న ఆఫీసర్ వంక తను దీనంగా చూశాడు.

"అలా బెల్లం కొట్టిన రాయిలా నిలబడతావే! సంతకం ఎక్కడ పెట్టావో చూసావా?"

భయం భయంగా ఆఫీసర్‌గారి పెన్ను పాళీవంక చూసాడు తను. ఆ క్రితం రోజు ఆదివారం. సోమవారం బదులు సంతకం ఖాళీగా వున్న ఆదివారం కాలంలో చేసాడు.

"సారీసార్!" కొట్టేసి ఆ రోజు కాలంలో సంతకం చేసాడు భయపడ్తూ భయపడ్తూనే.

"బి కేర్‌ఫుల్!" అది హెచ్చరికో, మందలింపో తనకి అర్థం కాలేదు.

తనకి నిజంగా ఆరోజు నిద్రమత్తు వదలకే అలా చేసాడా? కంగారులో అలా చేసాడా? ఏది ఏమయినప్పటికీ ఇలాంటివి ఈ మధ్యన రోజూ ఇంచుమించు జరుగుతూనే వున్నాయి.

"ఏమండీ!"

"ఆ మళ్ళీ ఏమయింది?"

"స్టవ్‌లో కిరసనాయిల్ అయిపోయినట్లుందండీ, అంటుకోవటం లేదు. నిన్న సాయంత్రం మీకు చెప్పటం మర్చాను. కిరసనాయిలు అయిపోయిందండి" చావు కబురు చల్లగా వినిపించింది తాయారు.

"డ్రమ్‌లో ఓ లీటరు పోళ్ళు తీసుకొచ్చి స్టవ్‌లో తగలేయి" అసహనంగా అన్నాడు సుబ్బారావు.

"అది కాదండి...."

"ఇహ నువ్వు నాకేం చెప్పక్కరలేదు" విసురుగా ఆఫీసు రూమ్‌లోకి వెళ్ళిపోయాడు షేవింగన్నా అఘోరిద్దామని.

కిరసనాయిలు లేదుట! లేదు. హు అది లేకపోతే స్టవ్ వెలగదు కదా! స్టవ్ వెలగకపోతే వేణ్ణీళ్ళు వుండవు. చావని! వేణ్ణీళ్ళు లేకపోతే ఆ కూల్ నీళ్ళే కుమ్మరించుకుని వణుకుతూ తగలడచ్చు! కాని....కానీ కాఫీ లేకపోతే? అమ్మో తనుండలేడు.

సబ్బు బ్రష్‌కి అంటించి, తెగ మర్దిస్తున్నాడు బ్రష్‌తో మొహాన్ని చిటపటలాడుతూ.

చివరికి వెలిగించిన లాంతర్ గడ్డంసామాను ఎక్కడుందో చూపెట్టటానికి వుపయోగపడింది ఏం చేస్తాం! అలా అయిపోయింది.

ఈ దిక్కుమాలిన గడ్డం ఒకటి. రెండ్రోజుల కొకసారి గ్రోమోర్ వేసిన మొక్కలా ఇష్టం వచ్చినట్లు పెరిగిపోతుంది. గ్రోమోర్ లేకపోతే మొక్కలు సరిగ్గా పెరగవేమో కాని ఏ మోర్ లేకుండా ఇట్టే మొలకెత్తేసి నిమిష నిమిషాభివృద్ధి అయిపోతుంది గడ్డం. ఏ ఎరువు లేకుండా పెరిగేది ఈ గడ్డం ఒక్కటే.

"గవాస్కర్ ఆ బ్లేడు వాడి అంత పెద్ద వాడయ్యాడు, నాగేశ్వర్రావ్ ఫలానా బ్లేడు వాడి అంత గొప్ప యాక్టరయ్యాడు" అని ఈ బోడి అడ్వర్టైజ్‌మెంట్లు ఒకటి. అదే బ్లేడు తను వాడితే ఏమయిందిప్పుడు? గడ్డం క్రింద చల్లగా తాకింది ఎర్రని రక్తం. చిన్న గాటు పడినట్లుంది. కారిపోతోంది నెత్తురు సెలయేరులా.

సుబ్బారావ్‌కి కోపం, ఉక్రోషం, చిరాకు అన్నీ హెచ్చిపోయాయి.

బయట వర్షం తెలుగు రచయిత్రిలా విజృంభించేస్తోంది జనాలు ఎలా చస్తారో చావమన్నట్లు.

తన అదృష్టంకొద్దీ మామగారు టేబుల్






క్లాకు ముందు ముందు రోజూకన్నా ఉపయోగపడుతుందని కొనిచ్చాడేమో!

నాయనా సుబ్బారావ్, రేపు ఉదయం ఆఫీసులు పెడితే, కొంపదీసి కరెంట్ పోయిందంటే ఈ రేడియం గడియారం నీకన్నివిధాల ఉపయోగిస్తుందని బహూకరించినట్లున్నాడు.

కొత్త భార్య మొహం కన్నా మెరిసిపోతోంది మామగారిచ్చిన రేడియం గడియారం.

అబ్బో! ఆరుంబావు, అమ్మో మరో పావు గంటలో బస్సు వచ్చేస్తుంది.

బస్సు మిస్సయిందంటే యింకేమయినా వుందా! సగంరోజు క్యాజుయల్ లీవ్ కసిగా కోసేస్తారు. అసలే తనకున్నది రెండంటే రెండే రోజుల లీవ్. ఈ విధంగా ఓ అరరోజు వేస్టు అయ్యిందంటే తను భరించలేడు.

ఈ పనివేళలు మార్చటం కాదుగాని కొత్తగా పెళ్ళయినవాళ్ళు ఎంత బాధ పడుతున్నారో పెట్టినవాళ్ళకేం తెలుసు? అసలు ఒక్క కొత్త దంపతులేంటి రిటైర్ కాబోయే వుద్యోగి వరకు ఎన్నెన్ని బాధలు అనుభవిస్తున్నారో ఈ పనివేళలు వచ్చిం తర్వాత. టైంకి తిండి తిప్పలు, నిద్రా వుండవుకదా! ఆ ఎవరు ఎలా గయితే ఎవరికి ఏమయింది? వెనకటికి తుగ్లక్ దౌలతాబాద్‌నుంచి హైదరాబాదుకు, హైదరాబాద్ నుంచి దౌలతాబాద్‌కి రాజధానులు మార్చేసాడుట. ఆయనగారేం నిక్షేపంలా వున్నారుగాని ప్రజలే ఏదేం రాజురా అని ఈ చెంపా ఆ చెంపా వాయించుకున్నారుట. ఇప్పుడూ అలానే వున్నట్లుంది చూస్తుంటే అనుకున్నాడు సుబ్బారావు, కొత్తగా ప్రవేశపెట్టిన పనివేళలను తిట్టుకుంటూ.

బాత్రూంలోకి వెళ్ళి తలుపు వేసుకోకుండానే స్నానం చేసొద్దామనుకున్నాడు. కాని తను ప్రస్తుతం వున్నది రెండు గదులు ఓ బోగి. బాత్రూమ్, లెట్రిన్ ఇన్‌స్టాల్‌మెంట్‌గా కట్టించినట్లున్నాడు ఇంటి ఓనర్ అదొక స్పెషల్ బోగిలా ఇంటి ఆవరణకి చివరగా. రెండింటికి కనెక్షన్ విశాల భూభాగం. దీన్ని దాటితేగాని బాత్రూమ్‌కి చేరుకోలేం. ఎంతో ఆలోచించి ఆలోచిస్తే ఐదారు ఎక్సిక్యూటివ్ ఇంజనీర్లకి ఒకే సమయంలో ఒకే ఐడియా వచ్చి ఈవిధంగా ప్లాన్‌వేసి ఇంటాయన చేత ఇలా కట్టించారు ఈ స్పెషల్ బోగీని.

ఇప్పుడు అక్కడికి చావాలంటే ఇదంతా దాటక తప్పదు. దాటామంటే మధ్యలోనే స్నానం చెయ్యక తప్పదు.

ఇప్పుడుగాని స్పెషల్ బోగీలోకని బయలుదేరామంటే మధ్యలో స్నానం, అక్కడికి వెళ్ళింతర్వాత అసలు స్నానం, చెంబు, సబ్బు సహాయంతో తర్వాత మళ్ళీ లోపలికి వచ్చేలోపల మరో స్నానం, ఇన్ని స్నానాల అనంతరం ఈ వానలో బస్‌స్టాప్ చేరేలోపల సముద్ర స్నానం. పెళ్ళిరోజు కూడా ఇన్నిన్ని స్నానాలు చేసినట్లు గుర్తులేదు సుబ్బారావుకి. చివరికి ఇన్ని స్నానాలు కొంపదీసి చేయను కదా అని బెంబేలుపడిపోయాడు.

అసలు ఏ గొడవా లేకుండా ఈ రోజు మానేస్తే!

అమ్మో యింకేమయినా వుందా? ఆడిట్ జరుగుతోంది. అందులో తను చేసే సీటుకి ఆడిట్ ఎక్కువ వుంది. వెళ్ళకపోతే యిటువంటి పరిస్థితులలో మెమో ఇచ్చి ఎక్స్‌ప్లనేషన్ కాల్‌ఫర్ చేసినా చెయ్యొచ్చు. ఆఫీసర్, ఆయనగారి పర్సనాలిటీ, నోరు జ్ఞాపకం వచ్చి అదిరిపోయాడు సుబ్బారావు.

భయము వదిలేయుటే గాంధీమతం
బాపు ననుసరిస్తే చాలు మనమందరం

భక్తకిరంజనిలో చివరి పాట కాబోలు తన డియరెస్ట్ ఫ్రెండ్ పెళ్ళిలో చదివించిన నూర్రూపాయల ట్రాన్సిస్టర్లో నుంచి వస్తోంది.

గాంధీగారికేం ఆయన ఏమన్నా చెబుతారు. ఈ చెంపమీదలాగి తంతే ఆ చెంపని కూడా అలాగే అంతకన్నా ఎక్కువగా తన్నించుకోమన్నాడు.

ఈ కాలంలో నిజంగా ఎవరయినా అలా చేస్తే బాబూ రెండు చెంపలు వాయించాను మూడో చెంపేది అనే ప్రబుద్ధులు కూడా లేకపోలేదు.

రాత్రి నుంచి ఇత్తడి బిందెలో మగ్గిపోతున్న చన్నీటితోనే ముఖం చేత్తో కడుక్కొని (సబ్బు వగయిరాలు ఏమీలేక) సమయానికి టవల్ దొరక్కపోవటంతో తాయారు చీర కుచ్చిళ్ళతోనే మొహం తుడిచేసుకుని ఇమీడియట్‌గా టయింకి దొరికిన పళ్ళులేని దువ్వెనతో తల దువ్వేసి కాసింత పౌడరనే తెల్లని సున్నాన్ని మొహానికి పూసేసి మరేం ఆలోచించక వస్తానన్నాడు భర్త అన్నట్లు!

బయట వర్షం మాత్రం ప్రతిపక్ష సభ్యులు అసెంబ్లీలో గోల తినట్లు గోల చేస్తోంది.

బొటనవ్రేలు దగ్గర వూడిపోయిన చెప్పు తోలును కాలివేళ్ళతోనే సరిచేసుకుంటూ బస్సుస్టాపుకు వెళ్ళేలోపలే ఇవాళ్టి స్నానం అయిపోతుందనుకునే ఒక్క వురుకున ఇంటి దగ్గర్నుంచి పెళ్ళాంకి కనీసం కర్టసీకయినా టాటా చెప్పకుండా పరుగు లంకించుకున్నాడు రెండు రోజులనుంచి తన జలుబుకి అంకితమయిన జేబు రుమాలుని నెత్తినెక్కించుకుని.

భర్త అవస్థ చూసి తాయారు విలవిల్లాడిపోయింది. వెధవ ఆఫీసులు, వెధవ పని వేళలు. పాపం కాఫీ కూడా తాగలేదు. ఎలాగో ఏమో. తను మాత్రం ఏం చెయ్యగలదు? ఓ నిట్టూర్పు విడిచి గడివేసుకుని దుప్పట్లో దూరిపోయింది ఒంటరిగా.

సుబ్బారావు రెండడుగులు వేసాడో లేదో కరెంట్ వచ్చేసింది 'నాతో ఇప్పుడేదయినా అవసరం వుందా?' అన్నట్లు.

సందు చివర పాల బూతులో పాలు వచ్చినట్లున్నాయి జనం గుమిగూడి వున్నారు గొడుగులు వేసుకుని.

అప్పటికే సుబ్బారావు స్నానం సగం అయిపోయింది!

బస్సు వుంటుందో వెళ్ళిపోతుందో అన్న అనుమానంతోనే ఆపసోపాలు పడుతూ బస్సు స్టాపుకు ఎలాగయితేనేం చేరాడు.

అనుమానం కాస్తా నిజమయి కూర్చుంది.

బస్సు స్టాపులో మానవమాత్రుడు లేడు.

వంద గజాల దూరంలో దేవదాసు సినిమాలో పార్వతిని అత్తారింటికి మోసుకుపోతున్న పల్లకిలా వెళ్ళిపోతోంది ఆర్‌టిసి బస్సు.

మరో ఇద్దరు సుబ్బారావులు అక్కడికి వచ్చేంతవరకు స్థాణువులా అలాగే నిలబడిపోయాడు సుబ్బారావు.

వెనక్కి వెళ్ళాలా, ముందుకు పోవాలా అన్న మీమాంసలో పడిపోయిన సుబ్బారావు ప్రకృతిమాత లాలనగా స్నానం చేయించేసి తనువుని వణికిస్తూ దూరంలో చూస్తున్నాడు ఏదయినా బస్సు వచ్చి కరుణిస్తుందేమోనని. □

# చేత వెన్నముద్ద

— వాకాటి

విషాదం బొమ్మయితే వినోదం బొరుసు.


నవ్వును తిరగేస్తే ఏడుపవుతుంది.

అందుకనే కొన్ని సందర్భాలలో ఏడ్వలేక నవ్వుతుంటాం.

ఈ అద్వైతాన్ని అద్భుతంగా చూపించిన మహా కళాకారుడు చార్లీ చాప్లిన్.

ప్రతి మనిషిలోనూ దాగిన భయానికి, బెరుకుకు, అపజయానికి, న్యూనతా భావానికి ప్రతీక అనదగిన ఒక బడుగువాని పాత్రను సృష్టించి, ఆ పాత్రను విశ్వజనీనం చేసిన స్రష్ట చాప్లిన్. అతడు ఏడిస్తే మనకు నవ్వొచ్చేది. అతడు నవ్వుతుంటే మనకు కడుపులో

ఎడిటింగ్ టేబుల్ ముందు చాప్లిన్



## నవ్వును తిరగేస్తే ఏడుపవుతుంది!